ప్రజాశక్తి

శనివారం 19 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ట్రావెల్స్ బస్సులో డ్రగ్స్!

- మాదక ద్రవ్యాల ఎగుమతికి కేంద్రంగా గుంటూరు
- అక్రమ రవాణాకు అడ్డాగా ప్రైవేటు బస్సులు
- ఎరువులు, పురుగు మందుల, నకిలీలకు ఆసరా

గుంటూరులోని ఒక ట్రావెల్స్ బస్సులో పట్టుబడ్డ డ్రగ్స్, ఇతర పరికరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని ప్రైవేటు ట్రావెల్స్ అక్రమాలకు అడ్డాగా మారాయి. వివిధ రకాల వస్తువులు అక్రమ రవాణాకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ట్రావెల్స్ ద్వారా దిగుమతి చేసుకుని గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు పంపుతుండగా వ్యవసాయ, విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. తాజాగా గురువారం రాత్రి బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు ఎగుమతి చేయనున్న డ్రగ్స్‌ను గుంటూరు కొత్తపేట పోలీసులు పట్టుకున్నారు. ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగదారులు, విక్రయదారులతో గుంటూరుకు చెందిన పలువురు అరెస్టవగా కొంతమందిపై కేసులు నమోదయ్యాయి.

గుంటూరులోని మస్తాన్ దర్గా నిర్వాహకుడు రామ్మోహనరావు కుమారుడు మస్తాన్‌సాయి ఓ సినీనటిపై లైంగిక దాడి అభియోగంలో అరెస్టయిన సందర్భంలో డ్రగ్స్ వ్యవహారం కూడా బయటకు వచ్చింది. బాధిత నటితోపాటు పాటు పలువురికి మస్తాన్‌సాయి డ్రగ్స్ సరఫరాలో కీలక భూమిక పోషించారనే అభియోగాలు వచ్చాయి. గుంటూరు లక్ష్మీపురంలోని ఒక హోటల్ నిర్వాహకుడు, ఒక టిఫిన్ సెంటర్ నిర్వాహకుడికి హైదరాబాద్‌లోని కొన్ని హోటల్స్ నిర్వాహకులతో డ్రగ్స్ విక్రయాలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో వీరిపై కేసులు నమోదయ్యాయి. నెహ్రూనగర్‌కు చెందిన మరో వ్యక్తికి కూడా డ్రగ్స్ సరఫరా కేసులో అరెస్టయ్యాడు.

తాజాగా బెంగుళూరు నుంచి గుంటూరుకు తీసుకువచ్చిన డ్రగ్స్‌ను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డుకు చెందిన షేక్ యూసఫ్ షరీఫ్ (27), గుంటూరు బ్రాడీపేటకు చెందిన బట్టు డోనాల్డ్ అలియాస్ టోనీ (29)ని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్ష విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎల్ఇడి బల్బుల్లో డ్రగ్స్‌ను ఎగుమతి చేస్తుండగా కొత్తపేట సిఐ వీరయ్య ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 66.26 గ్రాములు ఎమ్‌డిఎంఎ డ్రగ్స్‌తో పాటు పలు ఎలక్ట్రానిక్

2లో



తహశీల్దార్ ఛాంబర్ ఎదుట బైటాయించిన బాధితులు

వరద పరిహారం కోసం ముట్టడి

- తహశీల్దార్ కార్యాలయం వద్ద మహిళల ఆందోళన
- ఎన్నిసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోలేదని ఆగ్రహం

ప్రజాశక్తి-తాడేపల్లి

నష్టపరిహారం కోసం తాడేపల్లి సుందరయ్య నగర్, మహానాడు, కృష్ణవేణి నగర్ ప్రాంతాల వరద బాధితులు తహశీల్దార్ కార్యాలయాన్ని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ముట్టడించారు. గత నెలలో వచ్చిన వరదల్లో నీట మునిగిన తమ ఇళ్లకు ప్రభుత్వం ఇస్తామన్న నష్టపరిహారం ఇవ్వలేదని తహశీల్దార్ కార్యాలయం గేటు ముందు నిరసన తెలిపారు. ఇప్పటికే మూడుసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోవడం లేదని, దీనిపై తహశీల్దార్ సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. అయితే తాము బయటకు వచ్చి సమాధానం చెప్పే సంప్రదాయం లేదని, వరద సహాయం ఫైల్‌ను ప్రభుత్వం మూసివేసిందని, ఇప్పుడు వచ్చే అవకాశం లేదని, బాధితుల్లో నలుగురు వచ్చి అర్జీ ఇవ్వొచ్చని సమాచారాన్ని తహశ్శీల్దార్ పంపించారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన బాధితులు కార్యాలయంలోకి దూసుకెళ్లి తహశీల్దార్ గది ఎదుట బైటాయించారు. అప్పటికీ తహశీల్దార్ బయటకు రాకపోవడంతో బాధితులే

2లో

పల్నాడు జిల్లా రెంటచింతల మండలం సత్రశాలలోని టైల్‌పాండ్ వద్ద నీటి ఉధృతి

కృష్ణా నదికి కొనసాగుతున్న వరద

- ఇసుక తవ్వకాలకు తొలగని కష్టాలు
- ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో తీసుకునేందుకు అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణానదికి వరద కొనసాగుతోంది. శుక్రవారం నాగార్జున సాగర్ నుంచి 1,08,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి 1,06,805 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయగా సాగర్‌కు 1,08,505 క్యూసెక్కుల వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ నుంచి దిగువకు వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి నీటి విడుదల పెరగడంతో పులిచింతల, ప్రకాశం బ్యారేజికి కూడా వరద పోటు పెరిగింది. ప్రకాశం బ్యారేజి నుంచి దాదాపు 64 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు

2లో

విద్యుత్ ఛార్జీల భారం వద్దని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై రూ.8114 కోట్లు భారం మోపే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం గుంటూరు నగరంలో నిరసనలు జరిగాయి. గుజ్జనగుండ్ల కరెంటు ఆఫీసు వద్ద, ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఎ.చిష్టీ, నగర

2లో

గుజ్జనగుండ్లలో నిరసన తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

రోడ్డు ప్రమాదాల్లో పంచాయతీ కార్మికులు, టీచర్ దుర్మరణం

2లో

బదిలీ భయంతో బలి చేస్తారా?

- తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే మున్సిపల్ కార్యాలయానికి తాళం వేస్తాం
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- బాధిత ఉద్యోగులు, కార్మికుల నిరసనకు సంఘీభావం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ వేధింపుల్లో భాగంగా తొలగింపునకు గురైన నరసరావుపేట మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు, కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే మునిసిపల్ కార్యాలయానికి తాళాలేస్తామని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ హెచ్చరించారు. పదేళ్లకుపైగా పని చేస్తున్న వారిని అకారణంగా తొలగించారని విమర్శించారు. బాధిత ఉద్యోగులు, కార్మికుల నిరసన 16వ రోజు చేరగా 4వ రోజు కొనసాగుతన్న రిలేదీక్ష శిబిరాన్ని విజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. ఉద్యోగం కావాలంటే ఎమ్మెల్యే

2లో

కృష్ణా నదికి కొనసాగుతున్న వరద

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల, ప్రకాశం బ్యారేజి దిగువన ఉన్న రీచ్‌ల నుంచి ఇసుక తీయడం కష్టంగా మారింది. గత నెలలో లింగాయపాలెం, తాళ్లాయపాలెం, గుండిమెడ తదితర రీచ్‌ల వద్ద ఇసుక విక్రయాలకు స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేయగా వరదకు ఇసుక నదిలోకి కొట్టుకుపోయింది. ఈ పరిస్థితులలో వరద కొనసాగుతుండటం వల్ల ఇసుక తవ్వకాలు ముందుకు సాగడం లేదు. గుండిమెడ, బొమ్మువానిపాలెం, మున్నంగిలో ఇసుక తవ్వకాలకు టెండర్లు ఖరారు చేశారు. పల్నాడు జిల్లాలో అచ్చంపేట, అమరావతి మండలాల్లో కూడా పలు రీచ్‌లకు టెండర్లు ఖరారు చేయగా వరద ప్రభావం నుంచి నదీగర్భం నుంచి ఇసుక బయటకు తీయడం ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఈనెల 16 కల్లా ఇసుక పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యం నెరవేరలేదు.

గత నెల రోజులుగా ఇసుక దొరక్క ఉమ్మడి జిల్లాలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక ఇస్తామన్న ప్రభుత్వ హామీ ఫార్సుగా మారింది. ఆన్‌లైన్ బుకింగ్ అందని ద్రాక్షగా మిగిలింది. ఇసుక లేకపోవడంతో నిర్మాణం రంగంలో ఉపాధికి గండిపడింది. వేలాది మంది కార్మికులకు పనులులేక అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా నేరుగా నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉచిత ఇసుక విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక అవసరాలకు గతంలో రీచ్‌ల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు ఎడ్లబండ్లకు మాత్రమే అనుమతివ్వకగా తాజాగా ట్రాక్టర్ల ద్వారా తీసుకువెళ్లేందుకూ అనుమతిచ్చింది.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు భారీగా నీరు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువున్న నాగార్జునసాగర్ నుంచి 75 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ఎస్ఇ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను రెండు మీటర్లు రెండు క్రస్ట్ గేట్లను 1.5 మీటర్లుఎత్తి 69,000 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తూ రెండు యూనిట్లు ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూన్నారు. అనంతరం టైల్‌రైస్ ఛానల్ ద్వారా 8,420 క్యూసెక్కులను మొత్తంగా 77,420 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.07 ఎంయు (మిలియన్ యూనిట్ల)ల విద్యుత్ తయారైందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లో 75.50 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ఇది 7.080 (పూర్తిస్థాయి) టీఎంసీలకు సమానం.

12 మంది ఎంఎఎం విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలంలోని కేశానుపల్లి గ్రామ పరిధిలో గల ఎంఎఎం కళాశాలలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులకు చెందిన ప్రఖ్యాత క్యూ.ఎస్ పైడర్ సాఫ్ట్ వేర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమకు కాలేజీకి చెందిన 12 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఎంఎఎం మహిళ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య శుక్రవారం తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణ కాలంలో వార్షిక వేతనం రూ.4 లక్షలు కంపెనీ చెల్లిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ ఎం.రామశేషగిరి రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణిస్తున్నామని, వారు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన వారిని ప్లేసెమెంట్స్ ఆఫీసర్ జె. రవిశంకర్, విభాగాదిపతులు రాధిక, సితార, నవీన్ అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల్లో పంచాయతీ కార్మికులు, టీచర్ దుర్మరణం

మృతులు కంతేటి ఏసు, బత్తుల అయ్యప్పస్వామి (ఫైల్)

ఘటనా స్థలిలో ఉపాధ్యాయిని ధనలక్ష్మి మృతదేహం

ప్రజాశక్తి - తాడికొండ, తుళ్లూరు, వినుకొండ

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శుక్రవారం వాటిల్లిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పంచాయతీ కార్మికులు దుర్మరణం పాలవగా ఒక ఉపాధ్యాయిని మృత్యువాత పడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన కంతేటి ఏసు (63), బత్తుల అయ్యప్ప స్వామి (45) పంచాయతీ నీటి సరఫరా విభాగంలో కార్మికులుగా పని చేస్తున్నారు. నెమలికల్లులో ఓ ఫంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా తాడికొండ మండలంలోని నిడుముక్కల దర్గా వద్ద మూల మలుపులో గుర్తుతెలియన వాహనం ఢీకొట్టింది. ఒకరికి తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు 108లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తాడికొండ సిఐ కె.వాసు తెలిపారు. మృతుడు ఏసు భార్య, ఒక కుమార్తె గతంలోనే మరణించగా మరో కుమార్తె, కుమారుడు ఉన్నారు. మరో మృతుడు అయ్యప్పకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతులకు రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం తీవ్ర సంతాపాన్ని తెలిపింది. సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి, అధ్యక్షులు సిహెచ్.సుశీల, కార్యదర్శి కె.గోపిరాజు, నాయకులు ఎల్.సుఖవేణి సంతాపం తెలిపారు. మృతుల కుటుబాలు కడుబీదలని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పల్నాడు జిల్లా వినుకొండ మండలం నాగులవరం వద్ద రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని ధనలక్ష్మి (41) మృతి చెందారు. మృతురాలి భర్త నాగేశ్వరరావు, కుటుంబీకులు, తోటి ఉపాధ్యాయుల వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా అద్దంకి చెందిన ధనలక్ష్మి మండలంలోని గోకనకొండ పాఠశాలలో ఉపాధ్యాయిని (ఎస్‌జిటి)గా పని చేస్తున్నారు. ప్రతిరోజు అద్దంకి నుండి గోకనకొండకు ఆర్టీసీ బస్సులో నాగులవరం వద్దకు వచ్చి అక్కడి నుండి తన స్కూటీపై పాఠశాలకు వెళ్తుంటారు. వర్షాల నేపథ్యంలో మూడ్రోజుల కిందట గోకనకొండ నుండి స్కూటీపై అద్దంకి వెళుతూ చక్రాయపాలెం స్కూల్లో పార్క్ చేసి వెళ్లారు. శుక్రవారం గోకనకొండ స్కూలుకు బయలుదేరి తన స్కూటీ తీసుకుని వచ్చేందుకు చక్రాయపాలెం స్కూల్ వద్దకు ఉదయం 8.30 వెళ్ళగా స్కూలు తాళం తీయకపోవడంతో తోటి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం ఎక్కి గోకనకొండకు బయలుదేరారు. నాగులవరం వద్దకు రాగానే ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ద్విచక్ర వాహనం మార్జిన్ దిగి రోడ్డుపై ఎక్కుతున్న క్రమంలో వాహనం అదుపుతప్పి ధనలక్ష్మి రోడ్డుపై పడి తల వెనుక భాగానికి తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కోసం వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ పిల్లలకు ప్రైవేలు, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీని వర్తింపజేయాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేకు ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్‌ను పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె పల్నాడు జిల్లా అధ్యక్షులు దాసరి భువన్ మాట్లాడుతూ అక్రిడేషన్ మార్పులు, చేర్పులు, తదితర సమస్యలను ప్రస్తావించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి పి.నాగరాజు, గౌరవాధ్యక్షులు ఎన్.జగన్మోహన్‌రెడ్డి, కోశాధికారి వెంకటప్పయ్య, సభ్యులు పి.బుజ్జిబాబు, సైదా, అప్పారావు, జిలాని, శ్రీనివాస్, షాజీద్ కోటేశ్వరాచారి, కిరణ్, నాగరాజు పాల్గొన్నారు.

బదిలీ భయంతో బలి చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

సిఫార్సు లెటర్ అడుగుతున్నారని, వారికి చదువు అర్హత ఆధారంగా ఉద్యోగాలు వచ్చాయేగాని ఎమ్మెల్యే చెబితే కాదని అన్నారు. ఆప్కాస్‌లో ఉన్న ఉద్యోగులను, కార్మికులను తొలగించడం సాధ్యపడదనే విషయం ప్రజాప్రతినిధులకు అధికారులు వివరించాలన్నారు. ఎమ్మెల్యే మాట వినకపోతే బదిలీ చేస్తారన్న భయంతో ఉద్యోగులు, కార్మికులను బలి చేయడం దారుణమన్నారు. బదిలీకే అధికారులు భయపడితే కార్మికుల కుటుంబాలను రోడ్డుమీద పడేస్తే ఆ బాధ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రతిపక్షంలో ఉండగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపారని, అప్పటిలో పోటీ కార్మికులను పెట్టి పారిశుధ్య పనులు చేస్తున్న ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యేపై విమర్శలు చేశారని, ఇవన్నీ రాజకీయ లబ్ధికోసమేనని ఇప్పుడు తేలిందని మండిపడ్డారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని కార్మికులు, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ట్రావెల్స్ బస్సులో డ్రగ్స్!

(మొదటి పేజీ తరువాయి)

పరికరాలు, డ్రగ్స్ పీల్చటానికి వాడే డ్రగ్స్ ట్యూబ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. కళాశాల విద్యార్థులు, మత్తుకు అలవాటు పడిన యువకులే లక్ష్యంగా మత్తు పదార్థాలు గుంటూరుకు తెచ్చి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. విశాఖ పట్నం, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాల నుంచి గుంటూరు మీదుగా వివిధ ప్రాంతాలకు గంజాయి రవాణా అవుతోంది. గంజాయి రవాణా, వినియోగం చాలా వరకు నియంత్రించామని నిఘా పెంచుతామని ఎస్‌పి తెలిపారు.

వరద పరిహారం కోసం ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

లోపలికి చొచ్చుకెళ్లారు. కృష్ణా నది వరదల్లో పూర్తిగా నష్టపోయిన తమకు రూ.10 వేల నష్టపరిహారమైనా ఇవ్వరా అని ప్రశ్నించారు. కట్టుబట్టలతో మిగిలిన తమకు సాయం చేయకుండా ప్రభుత్వం ఇంకెవరికి సాయం చేస్తుందని నిలదీశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని, పరిహారం దక్కనివారంతా అర్జీలివ్వాలని చెప్పారు. గతంలో కొన్ని అర్జీలు ఫోన్ నంబర్లు సరిగ్గా వేయక పరిహారం అందకపోయి ఉండవచ్చని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులతో కూడా మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కలెక్టర్‌ను కలుస్తాం : సిపిఎం

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ వరద బాధితులకు న్యాయం కోసం జిల్లా కలెక్టర్‌ను రెండ్రోజుల్లో కలుస్తామని చెప్పారు. విజయవాడ నగరంలో గ్రౌండ్ ఫ్లోర్లో వరద నీరు వచ్చిన వారికి రూ.25 వేల నష్టపరిహారం ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. వరదలు వచ్చి ప్రజలు హాహాకారాలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. సిపిఎం తన శక్తి మేరకు ఐదు రోజులపాటు బాధితులకు రుచికరమైన ఆహారం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని దాతలు పెద్ద ఎత్తున వరద సాయం నేటికి ప్రభుత్వానికి అందిస్తున్నారని చెప్పారు. దాతలిచ్చిన విరాళాలన్నీ నిజమైన బాధితులకు అందాలన్నారు. తాడేపల్లిలో బాధితులను సర్వే చేసి నష్టపరిహారం పూర్తిగా అందజేశామని తహశీల్దార్ చెబుతున్నారని, అదే జరిగితే బాధితులు ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తారని ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పూర్తిస్థాయిలో పరిశీలించి బాధితులందరికీ పరిహారం దక్కేలా చూడాలని కోరారు. నష్టపరిహరం రాదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారని, బాధితులను ఇది పరిహాసమాడటమేనని మండిపడ్డారు. మహానాడు 25వ రోడ్డు ఎవరికి పరిహారం అందలేదని తెలిపారు. బాధితులందరికీ న్యాయం జరిగేంత వరకూ సిపిఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.కరుణాకర్‌రావు, డి.విజయ భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్, ఐద్వా నాయకులు డి.శ్రీనివాసకుమారి, కె.ఉష, పి.గిరిజ, జ్యోతి, భ్రమరాంబ, సుబ్బలక్ష్మి, బాధిత మహిళలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మాట్లాడుతున్న పాశం రామారావు

గుంటూరు బస్టాండ్ వద్ద నిరసన

విద్యుత్ ఛార్జీల భారం వద్దని సిపిఎం నిరసన

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాస రావు మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ప్రజలపై పెద్ద ఎత్తున విద్యుత్ భారం మోపుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, గత ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కూడా కాలేదని, ప్రజలపై వేల కోట్ల భారం మోపటానికి సిద్ధమైందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.8114 కోట్ల పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో రూ.12 వేల కోట్లు పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు, గ్యాస్, అన్ని రకాల ధరలూ పెరిగాయని, ఇప్పుడు విద్యుత్ భారం కూడా మోపటం అన్యాయమని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచితే ప్రజల నుండి వ్యతిరేకత తప్పదని, గత అనుభవాలను ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఆయా విద్యుత్తు కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నాయకులు షేక్ ఖాశిం షహీద్, ఆది నికల్సన్, షేక్ ఖాశింవలి, జి.లూథర్‌పాల్, షేక్ బాషా, ఎ.కళ్యాణి, టి.శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, ఎన్.మస్తాన్ పాల్గొన్నారు.

పూర్ణచంద్రరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వైఎస్ షర్మిల

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులుగా రామనాథం పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామనాథం పూర్ణచంద్రరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నియమించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూర్ణ చంద్రరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్ణచంద్రకు అభినందనలు తెలియజేశారు.

లేబర్ వెల్ఫేర్ స్థలం అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని లేబర్ వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని బాగుచేసి, దానిని వివిధ అభివద్ధి పనులకు ఉపయోగించనున్నట్లు ఎమ్మెల్యే నశీర్ తెలిపారు. కాకుమానివారి తోటలోని 13.58 ఎకరాల కార్మికశాఖ స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఇందులో 6.15 ఎకరాల స్థలంలో గవర్నమెంట్ హాస్పిటల్‌కు కేటాయించడం జరిగిందన్నారు. 10 పది రోజులలో ఈస్థలానికి రూ.90 లక్షలతో కాంపౌండ్ వాల్‌నిర్మింటం జరుగుతుందన్నారు. ఇక్కడ గవర్నమెంట్ హాస్పిటల్‌కు చెందిన ఆప్తమాలజీ, డెంటల్, ఇఎన్‌టి వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. వారం రోజులలోగా మొత్తం 13.58 ఎకరాల స్థలాన్ని చెట్లు కొట్టించి శుభ్రం చేసి చదును చేయాలని అధికారుల్ని ఆదేశించారు. 5 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, ఈ మొత్తం స్థలం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈస్థలం ఖాళీగా ఉండటం వల్ల అపరిశుభ్రంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గోళ్ళ ప్రభాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

శానిటేషన్ డ్రైవ్‌ను ముమ్మరం చేయాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో చేపట్టిన 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని ముమ్మరం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారుల్ని ఆదేశించారు. డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన అధికారులతో శుక్రవారం కమిషనర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యవేక్షణాధికారులు విధులలో మరింత శ్రద్ధ చూపాలన్నారు. డ్రైవ్‌లో భాగంగా స్పెషల్ ఆఫీసర్లు ఉదయం 5:30, మధ్యాహ్నం 2-30 గంటలకు ప్రతి శానిటరీ డివిజనుకు వెళ్ళి పారిశుధ్య కార్మికుల హాజరు, వార్డు శానిటేషన్ కార్యదర్శుల పనిని తనిఖీ చేయాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా చూడాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శివారు కాలనీలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల ద్వారా కాల్వలు, వీధులు శుభ్రపర్చటం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సుమ అట్లూరిని ఘనంగా సత్కరిస్తున్న డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, డాక్టర్ సోని తదితరులు

కెఎల్‌యులో బాలికలకు పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌లో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ప్రత్యేకంగా బాలికల కోసం మానసిక, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ మరియు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు విద్యార్థి సంక్షేమ విభాగం అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్ మెంట్ కన్వీనర్ డాక్టర్ రూత్ రమ్య శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సేఫ్ ఉపాధ్యక్షురాలు సుమ అట్లూరి ముఖ్య అతిథిగా హాజరయి బాలికలకు అవగాహన కల్పించారు. సుమ అట్లూరి ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్‌లో కోర్ లీడర్‌షిప్ టీమ్ సభ్యురాలు, రిసోర్స్ పర్సన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవిత నైపుణ్యాలు, భావోద్వేగ మద్దతు, మానసిక ఆరోగ్య విద్య, స్వీయ-అవగాహన, ఒత్తిడిని అధిగమించడం వంటి పలు అంశాలపైన మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, డాక్టర్ వి. కృష్ణా రెడ్డి, డాక్టర్ కె. సోనీ, హెచ్‌ఓడి బిఇఎస్ డా.పి.ఎన్.వి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొని సుమ అట్లూరిని ఘనంగా సత్కరించారు.

చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్

చీమలమర్రిలో భారీ చోరీ

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని చీమలమర్రి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి భారీ దొంగతనం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గడ్డం శివరామకృష్ణ, పద్మావతి దంపతులు తన మనవరాలి పెళ్లి గుంటూరులో ఉండడంతో 17వ తేదీన ఉదయం బయలుదేరి వెళ్లారు. అదే అదునుగా భావించిన దొంగలు అర్ధరాత్రి సమయంలో గోడ దూకి కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంటి లోపలి ప్రవేశించి బీరువాలో ఉన్న 32 గ్రాముల నానుతాడు, 24 గ్రాముల నల్లపూసల దండ, కొంత వెండి, రూ.40 వేల నగదు దొంగలు తీసుకెళ్లినట్టు తెలిపారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పల్నాడు జిల్లా క్లూస్ టీం ఎస్సై రహీం ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. గడ్డం శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నరసింగపాడు గ్రామానికి చెందిన పల్లంశెట్టి సుబ్బయ్య (48) నకరికల్లు లోని సరస్వతి శిశు మందిరం ఎదురు రోడ్డు దాటుతుండగా ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మానం ఫణింద్రారెడ్డి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో సుబ్బయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన ద్విచక్ర వాహనదారున్ని వైద్య శాలకు తరలించారు. మృతుని కుమారుడు మహేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి

భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం ఐతా నగర్ ప్రాంతానికి చెందిన సిహెచ్ రాజేష్(32) పెయింటర్ గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్థాపానికి గురైన రాజేష్ గురువారం రాత్రి మద్యంలో పురుగుమందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగంలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నాగార్జున విశ్వవిద్యాలయం లోని గానగంధర్వ పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్‌పి బాలసుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్ అండ్ ఫైనార్ట్స్ విభాగంలో ఈనెల 16 నుంచి జరుగుతున్న కార్యశాల శుక్రవారంతో ముగిసింది. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మీడియా యాక్టింగ్ అన్న అంశం పై ఈ వర్క్ షాప్‌ను నిర్వహించినట్లు విభాగాధిపతి డాక్టర్ ఎల్. వి . భూషణరావు తెలిపారు. కార్యశాలకు హైదరాబాదు నుంచి డాక్టర్ సిహెచ్. నటరాజ్ మూర్తి శిక్షణా తరగతులు నిర్వహించారు. రెండవ కోర్సు 2వ సంవత్సరం పాఠ్యాంశాలలో భాగంగా తరగతులు నిర్వహించి విద్యార్థులకు రేడియో, టీవీ, సినిమా, రంగస్థలం మొదలైన మాధ్యమాల మీద ఏ విధంగా నటించాలో వివరించారు. ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపల్ ఆచార్య సి.హెచ్. స్వరూపారాణి ఈ శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

దాడి ఘటనపై కేసు

ప్రజాశక్తి - తెనాలి : యువకుడిపై దాడి ఘటనపై పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం రామలింగేశ్వరపేట డిపో సెంటర్‌కు చెందిన సాయి కృష్ణ పై అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణ మరో నలుగురుతో కలిసి శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. బాధితుడు పోలీసులు నాశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ మద్యాన్ని సరఫరా చేసిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- రెంటచింతల : తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండవ నిందితుడైన గాజుల శ్రీనివాసరావును పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆగష్టు 6న జరిగిన సంఘటనలో నిందితుడు శ్రీనివాసరావుకు మెజిస్ట్రేట్ సత్య నారాయణ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై సిహెచ్ నాగార్జున తెలిపారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి.
డాక్యుమెంట్ నెం: 4792/2001

గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నవులూరు గ్రామం, మక్కేవారిపేట, డోర్ నెం: 4-14/1 రు వాస్తవ్యులు బిరుదుల వెంకటేశ్వర్లు గారి కుమారుడు బిరుదులు జయబాబు, వయస్సు 58 సం॥లు వారి ద్వారా సంజాయిషి పొందిన పిమ్మట యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా యొక్క క్లయింట్ బిరుదుల జయబాబు ది. 10-10-2024 వ తేదిన ఉదయం 10 గం॥ల సమయం లో గుంటూరు బస్టాండ్ వద్ద నుంచి బయలు దేరి మంగళగిరి రావటానికి ఆటో ఎక్కితిని, ఆటోలో వెళుతూ ఉండగా మార్గ మధ్యంలో జీరాక్స్ తీసుకొను నిమిత్తం పెదకాకాని వద్ద ఆగి చూడగా నా క్లయింట్ యొక్క ఇంటి స్థలము ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి. సదరు డాక్యుమెంట్ నెం 4792/2001, ది.28-08-2001న SRO మంగళగిరి నందు రిజిస్టర్ కాబడినది. సదరు సదరు డాక్యుమెంట్ ది. 10-10-2024వ జిరాక్స్ సెంటర్, పెదకాకానిలో పోయినది సదరు డాకుమెంట్స్ కోసం ఎంత వెతికనను దొరకలేదు

షెడ్యూలు:- గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్టర్ ఏరియా మంగళగిరి మండలము, నవులూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన నవులూరు గ్రామ డి.నెం. 811-ఏ రు దాఖలా య. 3.31 సెంట్లు, పై తెలిపిన దస్తావేజు ను ద్వారా సంక్రమించిన య.0.23 సెంట్లలో నేను లోగడ ప్రార్థన మందిరం కు వ్రాసియిచ్చిన య. 0.03 సెంట్లు పోగా మిగిలిన స్థలములో ఇప్పుడు మీరకు విక్రయించిన ఖాళీ నివేశన స్థలము హద్దులు-

తూర్పు : ఈ స్థలమునకు రేపూడి వెంకట స్వామి గారికి విక్రయించిన స్థలము కొరకు వదలబడిన 6 అడుగుల జాయింట్ నడవ అ 39 1/2 లు

దక్షిణం : ప్రార్థన మందిరం స్థలము ఆ 30 మీరు రేపూడి వెంకట స్వామి గారు జాయింట్ గా విక్రయం పొందిన స్థలము కొంత హద్దు ఆ 80.7.5 లు.

పడమర: వెంకట రమణ గారి స్థలము హద్దు ఆ 45లు.

ఉత్తరం : రేపూడి వెంకట స్వామి గారి ఈ రోజున మీ వలన విక్రయం పొందిన స్థలము ఆ 84 1/2 లు

యీ హద్దుల మధ్యగల చ. 388 లేక చ.మీ 324.36 ఖాళీ నివేశన స్థలము మాత్రమే.

కావున సదరు డాక్యుమెంట్ ఎవరికైనను దొరికినచో 10 రోజులలో ఈ క్రింది అడ్రెస్సనకు తెలియపరచ గలరు. అట్లు కానీ పక్షములో ఎవరైన ఏ విధమైన అన్యాక్రాంతము చేసినచో మేము తీసుకొను చర్యలకు మీరే బాధ్యులు

మంగళగిరి,
తారీఖు :18-10-2024

బుల్లా చందు,, B.Tech, B.L.
బుల్లా రమేష్ బాబు, B.A., L.L.B.
అడ్వకేట్ & నోటరి,
గవర్నమెంట్ అఫ్ ఆంధ్రప్రదేశ్
డోర్ నెం: 5-517, రాజీవ్ సెంటర్,
మంగళగిరి, గుంటూరు జిల్లా,
సెల్ నెం.9394076578

NOTICE
IN THE COURT OF THE HONORABLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT NARASARAOPET
I.P. No. 41/2024

Between:
భజంత్రీమని కిరణ్మయి (భర్త) శివ నాగయ్య,
వాసవి నగర్, నిఖిల టెక్నో స్కూలు దగ్గర,
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.

and

1) పంపాన అరుణ్, (తండ్రి) కుమార్,
కశింకోట గ్రామము, అనకాపల్లి మండలం,
అనకాపల్లి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
2) గండి సూర్యనారాయణ (తండ్రి) సత్యం
సూరిరెడ్డిపాలెం గ్రామము, సబ్బవరం మండలం,
అనకాపల్లి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
3) మాతంగి శిరీష, (భర్త) సాంసోను,
మల్లవరం గ్రామము, పెద్ద పలకలూరు మండలం,
గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
4) మాతంగి ప్రసాద్ (తండ్రి) నాగలింగం,
రాజాపేట గ్రామము, చిలకలూరిపేట మండలం,
పల్నాడు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

..... ప్రతివాదులు

పై నంబరు ఐ.పి.లోని పిటీషనరు తనను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషనులో రెస్పాండెంట్లు అయిన మీరు మరియు ఇంకా ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఈ వార్తా పత్రిక ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు తేది. 04-11-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం గం. 10-30 ని॥ లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టువారిచే మీ పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది. 04-11-2024

జడ పీటర్ పాల్
పిటీషనర్ తరపు అడ్వకేట్
చిలకలూరిపేట
సెల్ నెం.9676074671

మహారాజ శ్రీ గుంటూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం:1679/2022

బిట్వీన్:
గుణకాల జయకాంత్ ...వాది
మరియు
లాం రాజు .... ప్రతివాది

టు,
లాం రాజు, తండ్రి.లేటు జోసెఫ్, నివాసం : డోర్ నెం. 7-129, ఉర్దూ స్కూలు ఎదురు రోడ్డు, మేడికొండూరు, గుంటూరు జిల్లా-522438

పైనెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది: 04-11-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:04-11-2024

కొండూరి కృష్ణా రావు,
కొండూరి నంద కిషోర్,
వాది తరపు అడ్వకేట్స్, గుంటూరు.

NARASARAROPET MUNICIPALITY, NARASARAOPET
'e' – Procurement – Tender Notice

Tender Notice No.377/2024/E1, Dt.18-10-2024

1	Total No of Works	**14 Nos. of works** (Nit.No.5A/2024-25, 9A/2024-25, 13A/2024-25, 15A/2024-25, 18A/2024-25 and 21A/2024-25 to 29A/2024-25 – 2nd call.	**3 No's. of works** (Nit.No.31A/2024-25 to 33A/2024-25 – 1st call.
2	Total Estimate Value of Works	**Rs.1,99,90,000/-**	**Rs.26,65,000/-**
3	Bid document download starting date.	19-10-2024 - 11:00 AM	19-10-2024 - 11:00 AM
4	Bid document download end date.	04-11-2024 - 04:00 PM	04-11-2024 - 04:00 PM
5	Last Date & Time for receipt of Bids.	04-11-2024 - 05:00 PM	04-11-2024 - 05:00 PM
6	(Nit.No.5A/2024-25, 9A/2024-25, 13A/2024-25, 15A/2024-25, 18A/2024-25 and 21A/2024-25 to 29A/2024-25, 31A/2024-25 to 33A/2024-25 – Municipal General Funds)		

Note: Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued. Further details can be seen @ e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner, NARASARAOPET MUNICIPALITY, NARASARAOPET.

పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి - వినుకొండ

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని దొండపాడులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన పల్లెపాటి కొండయ్య (51) గ్రామ శివారులో గొర్రెలను మేపుతుండగా సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. దీంతో కొండయ్య సమీపంలోని చెట్టు కిందకు చేరగా కొద్దిసేపటికి పిడుగు పడి కొండయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పొలాల్లోని స్థానికులు గమనించి ఈ విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆస్పత్రి, పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి -నకరికల్లు

మండల కేంద్రమైన నకరికల్లులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, నరసింగపాడులోని ఎంపియుపి పాఠశాలను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. పిహెచ్‌సిలో వ్యాక్సినేషన్ గురించి ఆరా తీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదులను, పరిసరాలను తనిఖీ చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్వోప్లాంట్ నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మధ్యాహ్నం భోజన నిర్వహణలో లోపాలను సహించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ ఎం.వెంకటేశ్వర్లు, తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఒ కాశయ్య, ఎంఇఒ ప్రసాద్, మండల వైద్యాధికారి షేక్ హసీనా, మండల కో-ఆర్డినేటర్ బి.మల్లికార్జునరావు ఉన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సిపిఎం మాదల మహిళ శాఖ మహాసభ శుక్రవారం జరిగింది. గ్రామంలోని సైడు కాల్వలు పూడి పోయి రోడ్డు మీదే మురుగునీరు ప్రవహిస్తోందని, తక్షణమే కాల్వలు శుభ్రం చేసి మురుగునీరు రోడ్డు మీద పారకుండా చర్యలు తీసుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది. లైబ్రరీ సెంటర్ వద్ద నుంచి మాదల నుండి సత్తెనపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న సిమెంట్ రోడ్డు వరకు సైడు కాలవలు నిర్మించాలని, అక్కడ నుండి సత్తెనపల్లి వరకూ ఉన్న డొంక రోడ్డుకు సైడు కాల్వలు పూడిక తీసి మరమ్మతు చేయాలని, డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం నూతన కార్యదర్శిగా రాయల శివపార్వతి, సహాయ కార్యదర్శిగా గొలప్రోలు కోటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ, జిల్లా నాయకులు జి.రజిని, జి.ఉమశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - అమరావతి

ప్రజలపై రూ.8,114 కోట్ల విద్యుత్తు భారాలకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.సూరిబాబు విమర్శించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. సూరిబాబు మాట్లాడుతూ ఒకవైపు నిత్యావసరాల ధరలు పెరుగుతుండగా వాటిని నియంత్రణ చేయని ప్రభుత్వాలు అదనపు భారాలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇదేవిధంగా భారాలేస్తే అప్పుడు వ్యతిరేకించిన టిడిపి, జనసేన నిరసన కార్యక్రమాలూ చేపట్టాయని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వాటిని రద్దు చేస్తామనీ ప్రకటించి ఇప్పుడు ట్రూ అప్ ఛార్జీల బాదుడుకు పూనుకోవడం దారుణమన్నారు. ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో భారాలు వేయడం మానుకుని సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరారు.

అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నిరసనలో ఎస్.రాజకుమార్, ఎం.సుబ్రహ్మణ్యం, సిహెచ్ మురహరి, పి.సత్యనారాయణ, రఫీ, వైసిపి నాయకులు టి.సూరిబాబు, డి.ప్రసాదు పాల్గొన్నారు.

చీలిక పెదవులకు ఉచితంగా ఆపరేషన్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చీలిక పెదవులు (గ్రహణ మొర్రి) భారతదేశంలో అత్యంత సాధారణ పుట్టుకతో వచ్చే లోపాల్లో ఒకటని చీలిక పెదవి, చీలిక అంగలి అనేది గర్భాశయంలో పిండం అభివృద్ధి చెందుతున్నప్పుడు సంభవించే పై పెదవి, నోటిలో విభజనలకు సంబంధించి అధునాతన శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి తెలిపారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుండి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెలలు నిండిన గర్భస్థ శిశువు చీలిక పెదవులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా నిర్ధారించే అవకాశం ఉందని, పుట్టుకతో వచ్చే లోపానికి చికిత్స చేయడంలో నైపుణ్యం కలిగిన వైద్య నిపుణుల బృందం శిశువు సంరక్షణను సమన్వయం చేస్తూ ప్రసవమైన తొలి రోజునే చీలిక పెదవిని 1 లేదా 2 శస్త్ర చికిత్సలు ద్వారా నయం చేయొచ్చని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్లు నరసరావుపేట పల్నాడు రోడ్డులోని పాత గవర్నమెంట్ హాస్పిటల్ డైక్ సెంటర్‌లో పూర్తి ఉచితమన్నారు. దీనికి సంబంధించి వైద్య సిబ్బంది ఈ నెల 22న మాచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారని, గ్రహణ మొర్రి ఉన్న చిన్న పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శస్త్ర చికిత్స ద్వారా గ్రహణ మొర్రి సమస్యను సమర్ధవంతంగా నివారించేందుకు అవకాశం ఉంటుందని, చిన్న వయసులో చేసే శస్త్ర చికిత్సలు మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'గీతాంజలి లీడ్' విద్యార్థిని

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతాంజలి లీడ్ స్కూల్ విద్యార్థిని ఇండియా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి తెలిపారు. 2వ తరగతి విద్యార్థిని అన్నా జ్ఞానషిఖ ఒక నిముషంలో అత్యధిక హోలా స్పిన్స్ చేసిన బాలికగా ఈ రికార్డు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 60 సెకండ్ల సమయంలో 170 సార్లు హోలా రింగ్ను స్పిన్ చేసి ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. బాలికను కరస్పాండెంట్ వై.యల్.కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాలు

మంగళగిరిలో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు, ఓటు నమోదును ప్రారంభిస్తున్న డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు కావాలని, ప్రజాస్వామ్యంలో ప్రాణప్రదనమైన ఓటు హక్కును పొందటానికి దరఖాస్తు చేసుకోవాలని యుటిఎఫ్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు కోరారు. ఇందుకోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా మంగళగిరిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో టిప్పర్ల బజార్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటు నమోదు కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయుల హక్కుల కోసం శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న కృషిని వివరించారు. శాసనమండలిలో ప్రజా హక్కుల కోసం పోరాడే సభ్యులను ఎన్నుకోవాలని ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలు వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారని, వారి గొంతుక శాసనమండలిలో ప్రతిధ్వనించాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించుకోవాలని చెప్పారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ ఆన్లైన్ ఓటర్ నమోదును ప్రారంభించి మాట్లాడుతూ మంగళగిరిలో ప్రభుత్వ ఆసుపత్రి కొంతమేరకు అభివృద్ధి జరిగిందంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో చేసిన కృషి వల్లనే అని వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, ఎ.శ్రీనివాసరావు, యు.రాజశేఖర్, జి.అచ్యుతరావు, టి.ఆంజనేయులు, నాయకులు ఎం.కోటిరెడ్డి, యు.ఏడుకొండలు, సిహెచ్ ఆనంద్‌కుమార్, సిహెచ్.సుబ్బారావు, పి.అరుణ్, కె.భాస్కర్, పి.వెంకటేశ్వర్లు, సిహెచ్‌వి.రాధాకష్ణ, రాంబాబు, ఇందుమతి, జి.అచ్యుతరావు, ఎస్.బాలకృష్ణ, ప్రజాసంఘాల నాయకులు పి.బాలకృష్ణ, ఎం.నాగేశ్వరావు, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

యుటిఎఫ్ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రాన్ని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ టిఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు ప్రారంభించారు. అర్హతున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి గయానుద్దౌలా, జిల్లా కార్యదర్శులు సాంబశివరావు, కేథార్నాథ్, కామాక్షి, ప్రసన్నత్, సతీష్, నాగేంద్రబాబు, కోటి సుందరరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, కాలేషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

పట్టబద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ ఎన్వివిఎస్ వరప్రసాద్ (బుజ్జి) అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని కచేరి సెంటర్లో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పట్టభద్రుల ఓట్ల నమోదుపై నవంబర్ 2021 సంవత్సరానికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటర్ నమోదుకు అర్హులేనని అన్నారు. గతవారం రోజులుగా పెదకూరపాడులో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఓట్లు నమోదు చేస్తున్న నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. ఈ సందర్భంగా క్రోసూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్తిపాటి సురేష్ తన ఓటును నమోదు చేసుకున్నారు. డిగ్రీ ప్రొవిజినల్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఓటర్ ఐడి జిరాక్స్, ఫొటోతో ఓటును నమోదు చేసుకోవాలని పట్టభద్రులకు సిఐ సూచించారు. ఓటు ఎంతో విలువైనదని బిఎ,బీకాం, బీఎస్సీ, బీటెక్,ఎంబీబీఎస్ ఏదైనా డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, జన చైతన్య సమితి నిర్వాహకులు వెలితోటి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై విద్యుత్ భారం మోపద్దు

విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు - కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

పెదకాకాని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసనలో మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి - పెదకాకాని

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చారని, తాను ఇచ్చిన హామీలు కు కట్టుబడి ఉండాలి అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రూ అప్ ఛార్జీలు మోపడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పెదకాకాని సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం మండల కార్యదర్శి ఎన్ శివాజి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ధర్నాలో నేతాజీ మాట్లాడుతు సుమారు 8వేల కోట్ల రూపాయలు విద్యుత్ వినియోగ దారుల నుండి విద్యుత్ చార్జీలు వసూలు చేసుకొనుటకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ఎలక్ట్రిసిటీ రేగులేషన్ కమిషన్ విజ్ఞాప్తి చేశారని అందుకు అనుగుణంగా రెగ్యులేటరీ కమిషన్, పబ్లిక్ హియరింగ్ కు నోటీసు లు జారీ చేసింది అని అన్నారు. గతంలో కూడా ఇలాగే జరిగి విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేసు కొనుటకు అనుమతి ఇచ్చింది అని అన్నారు. అన్ని రకాల నిత్య జీవిత సరుకులు కూరగాయలు ఆకుకూరలు పండ్లు హెూటల్ తిను బండారాలు బాగా పెరిగి ప్రజలు త్రీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ చార్జీలు పెంచితే వాటి ధరలు మరింత పెరిగి ప్రజలు పస్తులు వుండ వలసిన పరిస్థితి వస్తుందని అన్నారు. డిస్కంలు పెట్టిన ప్రతి పాదనలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ఆ భారం ప్రజలపై పడకుండా చూడాలని కోరారు. ధర్నా అనంతరం ఏ ఈ బ్రహ్మయ్య కు వినతి పత్రం ఇచ్చారు. కార్య క్రమం లో ఉల్లంగుల శివయ్య, కే సత్యనారాయణ, ఆర్ వెంకటరమణ, పూర్ణ కంటి నాగమణి, లక్ష్మీ కాంతమ్మ పాల్గొన్నారు.

తుళ్లూరులో సిపిఎం నాయకుల నిరసనలో మాట్లాడుతున్న ఎం రవి

ప్రజాశక్తి - తుళ్లూరు : ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపే యత్నాలను విర మించుకోవాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో శుక్ర ావారం సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి ఎం రవి, ఎం భాగ్య రాజు తదితరులు నిరసన తెలిపారు. లైబ్రరీ సెంటర్లో ఎర్ర జెండాలు చేతబట్టి నినా దాలు చేశారు. అనంతరం రాయపూడి లోని ఎన్టీఆర్ విద్యుత్ భవన్ లో అధికా రులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వల్లభాపురం వెంకటే శ్వరరావు,పేరం బాబురావు,పి వెంకటేశ్వరరావు,షేక్ జానీ,కుంభా ఆంజనేయులు పాల్గొన్నారు.

చినకాకాని సబ్‌స్టేషన్ వద్ద నిరసనలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రభుత్వం ట్రాప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను విద్యుత్ వినియోగదారులపై మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం మంగళగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న కాకాని విద్యు త్ సబ్స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం చార్జీలు, అదనపు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపడాన్ని విమర్శించారు. వెంటనే ఈ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బి. కోటేశ్వరి, టి. ప్రసాద రెడ్డి, ఆళ్ళ సాంబిరెడ్డి, ఎస్. సుమ, ఎస్. నిర్మల, గండికోట బాబు వరప్రసాద్, ఉద్దంటి దుర్గారావు, చెన్నం కుమారస్వామి, శివయ్య, ఈదా శేఖర్ రెడ్డి, పాలేటి అప్పారావు, గాదె మాధవరెడ్డి, గోపాల్ రెడ్డి, కారుమూరు గోపాలరెడ్డి, నరసింహారావు, సత్యనారాయణ, శివారెడ్డి, గడ్డం అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ట్రాప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను విద్యుత్ వినియోగదారులపై మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి ఘాట్ రోడ్ గల విద్యు త్ సబ్స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన

మంగళగిరిలో నిరసన తెలుపుతున్న నాయకులు

కూటమి ప్రభుత్వం చార్జీలు, అదనపు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపడాన్ని విమర్శించారు. వెంటనే ఈ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె.వి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, పట్టణ నాయకులు జె శివ భవన్ నారాయణ, ఎం చంద్రారావు, ఈ కాటమరాజు, ఈ విజయలక్ష్మి, డి రామారావు, కే వెంకటేశ్వర్లు, కే ఏడుకొండలు, రైతు సంఘం నాయకులు జి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లి నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-తాడేపల్లి : ట్రూ అప్ చార్జీలపై ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ తప్పిందని సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు విమర్శి ంచారు. దొంగ చాటున ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో ప్రజలపై భారం మోపటాన్ని నిరసిస్తూ శుక్రవారం నులకపేట విద్యుత్ సబ్స్టేషన్ ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. పెంచిన చార్జీలు దించకపోతే మరో విద్యుత్ ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దొంత రెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టే కరుణాకర్ రావు, కె మేరీ, డి విజయభాస్కర్ రెడ్డి, వై బర్నబాస్, ఏ సేవిరి భర్త లో, కే స్టీవెన్, ఎన్ దుర్గారావు, బి యేసయ్యా, ఎమ్మెల్యే నరసింహారావు. సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు కే ఆదినారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ మెల్లంపూడి సబ్ స్టేషన్ వద నిరసనలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపే ప్రయత్నాలను ఉపసంహరించు కోవాలని, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు.ఎంటిఎంసీ పరిధిలోని మెల్లంపూడి విద్యుత్ సబ్స్టేషన్ వద్ద సిపిఎం తాడేపల్లి రూరల్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు ట్రూ అప్ చార్జీల బారాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పిన కూటమి నేతల మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నిం చారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, మండల నాయకులు పల్లె కృష్ణ, నాగ పోగు విజయరాజు, బొప్పన గోపాలరావు, కంచర్ల జేమ్స్, పల్లపాటి సుబ్బారావు, కురగంటి ప్రభాకర్, నాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై అదనపు భారాన్ని మోపడం అన్యాయమని సిపిఎం కమిటి తెనాలి ఏరియా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ అన్నారు. విద్యుత్ చార్జీలు పెంపుపై ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించూకోవాలని కోరుతూ శుక్రవారం సిపిఎం తెనాలి డివిజన్ ఆధ్వర్యంలో తెనాలి డివిజన్ ఎపిసిపిడిసిఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనం తరం ఎపిసిపిడిసిఎల్ తెనాలి డివిజన్ ఈఈ వివి చిరంజీవిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్య క్రమంలోనాయకులు ములకా శివ సాంబి రెడ్డి షేక్ హుస్సేన్ వలి, ఎం సాంబశివ రావు, జి వెంకట సుబ్బయ్య, కె గోపి, ఎం వెంకయ్య పాల్గొన్నారు.

తెనాలిలో వినతి పత్రం ఇస్తున్న బాబుప్రసాద్ తదితరులు

ఫిరంగిపురంలో

మేడికొండూరులో

ప్రజాశక్తి- ఫిరంగిపురం, మేడికొండూరు

మండల కమిటీ ఆధ్వర్యంలో ఫిరంగిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది ధర్నా అనంతరం సబ్ స్టేషన్ అధికారులకు అర్జీ ఇవ్వటం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు, ఫిరంగిపురం మండల కార్యదర్శి యస్.ఎం. వలి, మండల కమిటీ సభ్యులు జి వి రావు, ఏ అంకమ రావు, బాలశౌరి, సాంబశివరావు, సిహెచ్ శ్రీనివాసరావు కే ఏసుబాబు, బాల్ రెడ్డి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మేడికొండూరు మండలం డోకిపర్రు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం మేడికొండూరు శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కార్యదర్శి ఎస్ఎం భాష వినతిపత్రం శుక్రవారం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి శ్రీనివాసరావు, బొట్ల రామకృష్ణ, సుబాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుగ్గిరాల : సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించి తహసిల్దార్ ఐ సునితకు అర్జినీ ఇచ్చారు. కార్యక్ర మంలో మండల నాయ కులు జెట్టి బాలరాజు ఎం నాగమల్లేశ్వరరావు ఎం నరసింహారావు బి అమ్మిరెడ్డి ఎన్ ఎస్ రత్నం జి శ్రీనివాసరావు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో

ప్రజాశక్తి -తాడికొండ : తాడికొండ అక్టోబర్ 18 ట్రూ ఆప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం తాడికొండలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు . అనంతరం వినతి పత్రాన్ని విద్యుత్ అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు ,రైతు సంఘ నాయకులు ఇమ్మడి రామారావు ,బాణావత్ భద్రయ్య ,జోషి ,షేక్ సుభాని ,కోటిరెడ్డి పాల్గొన్నారు.

తాడికొండలో

పెదనందిపాడులో

ప్రజాశక్తి - పెదనందిపాడు: ట్రూ అప్ చార్జీలు పేరిట విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ సిపిఎం పెదనందిపాడు మండల కమిటి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు లు మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. డిస్కంలు పెట్టిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ఆ భారం ప్రజలపై పడకుండా చూడాలని కోరారు. అనంతరం నాగులపాడు లోని ఏఈ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి నల్లమోతు రాజేంద్ర, మర్రి లక్ష్మి, షేక్ షమీ, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మనబడి-మన భవిష్యత్‌గా నాడు-నేడు

ప్రజాశక్తి - రెంటచింతల

పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు- నేడు పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్పు చేసిందని సత్తెనపల్లి డిప్యూటీ ఈవో ఏసుబాబు తెలిపారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనబడి - మన భవిష్యత్తుగా మార్పు చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని, ఈ మేరకు బ్యాంకు ఖాతాలో కూడా మార్చాలని పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసి (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) సభ్యులు జాయింట్ చెక్‌హోల్డర్‌గా బ్యాంకు ఖాతాలో పేర్లు మార్పు చేయాలని సూచించార.ు డివిజన్ లోని హెచ్ఎంలు బ్యాంకు ఖాతాల్లో ఈ మార్పులు వెంటనే చేయాలన్నారు.

రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభం

ప్రజాశక్తి - దాచేపల్లి

భూ సమస్యలపై నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలు మండలంలోని అలుగుమెలుగుపాడులో శుక్రవారం ప్రారంభ మయ్యాయి. తహశీల్దార్ కుటుంబరావు మాట్లాడుతూ భూరీసర్వేలో తప్పులేమైనా జరిగుంటే అధికారుల దృష్టికి తేస్తే పరిష్కరిస్తామన్నారు. తమకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో నేమిలిరెడ్డి, టిడిపి నాయకులు వి.తిరుమలకుమార్, ఎన్.పుల్లయ్య, నారాయణ, శ్రీరాములు, బిక్షాలు, కాశయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని సాతులూరులో సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. తహశీల్దార్ ఎ.రమణ మాట్లాడుతూ రీ సర్వేలో సమస్యలొచ్చిన వారు తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 35 అర్జీలు రాగా వీటిల్లో ఎక్కువ మంది తమ భూమి శాతం తగ్గినట్లు అర్జీల్లో పేర్కొన్నారని తహశీల్దార్ తెలిపారు.

మినీ జాబ్‌మేళాలో 68 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ అధ్వర్యంలో స్థానిక ఎస్‌కెబిఆర్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 91 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరవగా 68 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి తెలిపారు. యాక్సిస్ బ్యాంకు, జయలక్ష్మి ఆటోమోటివ్, రిలయన్స్ రిటైల్ సర్వీసెస్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని, వీరికి త్వరలోనే నియామక ఉత్తర్వులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జెకెసి కో-ఆర్డినేటర్ వి.సామ్యూల్‌సుకుమార్, ఎపిడిసి కన్వీనర్ ఆర్.కిరణ్‌నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మికుమారి

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై తాత్సారం ఇంకెంతకాలం?

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా, వినతి

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ఇంకెంతకాలం నిర్లక్ష్యం చేస్తారని యుటిఎఫ్ నాయకులు ప్రశ్నించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం డిఇఒ ఎం.వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ హైస్కూలులో ఇప్పటికే తగినంతమంది ఉపాధ్యాయుల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమోషన్లు, బదిలీలు లేవని, ఎప్పుడు నిర్వహిస్తారో తెలియడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. అర్బన్ ఎంఇఒ పోస్టుల్లేక పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందనిన్నారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుందని అధికారులు గ్రహించి ప్రభుత్వానికి నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ టీచర్ల ఖాతాలు మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికీ సిద్ధమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, ఎ.భాగేశ్వరిదేవి, కార్యదర్శి కె.తిరుపతిస్వామి, నాయకులు కె.ఉషా సౌరీరాణి, ఒ.కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ఒ.సాంబయ్య, జి.ఆంజనేయులు, కె.వి.నాగయ్య, ఎస్.కెమీరాభి, కె.ధనలక్ష్మి, హరిత, ఎస్.కె కాసింబి, కోమలి, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డేయకుంటే రాస్తారోకో చేస్తాం : రైతు సంఘం

ప్రజాశక్తి - వినుకొండ

దశాబ్ద కాలంగా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులు రైతులు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలిచ్చినా రోడ్డు నిర్మాణం చేపట్టడంలో జాప్యం చేస్తున్నారని రైతుసంఘం మండల కార్యదర్శి రాజారపు మునివెంకటేశ్వర్లు విమర్శించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలుగా మారిన రోడ్ల ఆయన శుక్రవారం పరిశీలించారు. గోతుల మయంగా మారిన రోడ్లపై వెళ్తున్న విద్యార్థులు, రైతులు, ద్విచక్ర వాహనదారులతో మాట్లాడారు. వినుకొండ నుండి భారతపురం, నడిగడ్డ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందు రోడ్డును పదేళ్ల క్రితం తొలగించారని, ఆ రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేయడం లేదని అన్నారు. ఇప్పటికే రెండుసార్లు తిమ్మాయపాలెం సచివాలయం వద్ద ధర్నా చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు నాన్న ఇబ్బందులు పడాల్సి వస్తోందని, బస్ సౌకర్యం, ఆటో సౌకర్యాలు లేక ద్విచక్ర వాహనదారులను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. రోడ్డు సక్రంగా లేనందున ఆర్టీసీ బస్సును రూట్ మళ్లించి నడుపుతుందని చెప్పారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టకుంటే ప్రజలు, విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలలో యాక్టిజన్ క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి - దాచేపల్లి

స్థానిక ప్రభుత్వ మోడల్ పాఠశాలలో యాక్టిజన్ క్లబ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఏపీ మోడల్ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ తెలిపారు. ఈ పోలింగ్ ద్వారా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య భావన, విలువలు, పౌరసత్వం, ప్రభుత్వంపై అవగాహన కలిగించేందుకు ఈ యాక్టిజన్ క్లబ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ క్లబ్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్షులను విద్యార్థులే ఎన్నుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు రేణుక, కృష్ణవేణి పాల్గొన్నారు.

పాఠశాలలకు సన్నబియ్యం కోసం అర్జీ

ప్రజాశక్తి - దాచేపల్లి

ప్రభుత్వ పాఠశాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించాలని ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ అంబటి రవికుమార్, జెడ్‌పి పాఠశాల చైర్మన్ పూసల హాఫీజ్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కుటుంబరావుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థులకు పోషకాహారం, సన్న బియ్యం వల్ల ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

డిజిటల్ చెల్లింపు ద్వారా రైల్వే టిక్కెట్లు

ప్రజాశక్తి- మాచర్ల

గుంటూరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో డిజిటల్ పేమెంట్స్ క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ ద్వారా టికెట్ల విక్రయాలు చేపట్టినట్లు గుంటూరు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకరబాబు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలను శుక్రవారం మాచర్ల రైల్వే స్టేషన్ అధికారులకు అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యూఆర్ కోడ్ డిస్‌ప్లే పరికరాలు ప్రయాణికులకు ఎంతో ఉపయోకరంగా ఉంటాయన్నారు. ప్రయాణికులు టిక్కెట్ కొనుగోలు, రిజర్వేషన్ చేసుకునే సమయంలో క్యూఆర్ కోడ్ స్కానర్‌లో స్కానింగ్ చేసి చెల్లింపు చేయవచ్చునన్నారు. నగదు రహిత సేవలను అందించేందుకు రైల్వే శాఖ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని వలన కౌంటర్ల వద్ద చిల్లర కష్టాలు కూడా తీరిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ ఎన్.రాజు, నడికూడి ఇన్‌స్పెక్టర్ పి.యాదీయ్య, మాచర్ల ఎస్ఎస్ పి.శివప్రసాద్, టికెట్ చెకింగ్ స్టాఫ్ ఒ.అనీల్, బివిఎస్.రెడ్డి, టి.వి.రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల రికార్డులివ్వకుంటే డబ్బులు రికవరీ

ప్రజాశక్తి-ఈపూరు

గ్రామీణ ఉపాధి హామీ ద్వారా 2023 ఏప్రిల్ ఒకటి నుండి 31 మార్చి 2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టనుందని ఎస్ఆర్పీ జెఎస్‌రాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. మండలంలో మొత్తం 516 పనులు జరగగా వాటిలో ఉపాధి హామీ పనులు 493కు గాను రూ.7 కోట్ల 25 లక్షల 97 వేల 534 ఖర్చు చేశారన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 23 పనులకు గాను రూ.కోటీ 22 లక్షల 78 వేల 288 ఖర్చు చేశారన్నారు. సామాజిక తనిఖీల్లో జాబ్ కార్డుల నమోదు, 14 రకాల రికార్డులు, పని ప్రదేశంలో పని వివరాలు తెలిపే బోర్డులు, ఏడు రకాల రిజిస్టర్లు నమోదులను డీఆర్పీ బృందం తనిఖీ చేస్తుందని అన్నారు. పంచాయతీలలో ఆరుగురు డీఆర్పీలు తనిఖీ చేస్తారని, గ్రామసభలపై ప్రజలకు దండోరా ద్వారా తెలపాలని చెప్పారు. ఈనెల 22 నుండి 28వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 29వ తేదీన ప్రజా వేదిక చేపడతామన్నారు. సామాజిక తనిఖీ బృందానికి క్షేత్ర సహాయకులు అందుబాటులో ఉండి జరిగిన పనులను చూపించాలన్నారు. పనులకు సంబంధించిన రికార్డులను క్షేత్ర సహాయకులు ఇవ్వకపోతే వాటిని రికవరీ కింద నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీవో ఎం.లక్ష్మణరావు ఉన్నారు.

ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను రద్దు చేయాలి

ప్రజాశక్తి- వెల్దుర్తి : ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ పల్నాడు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కొమ్ముకిషోర్, మాచర్ల మండలశాఖ అధ్యక్షులు కుంభా పోతురాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల ఎపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 21వ తేది నుండి 6 రోజుల పాటు నిర్వహించే 1, 2 తరగతులను భోధించే ఉపాధ్యాయులకు సుదూర ప్రాంతాల్లో శిక్షణా తరగతుల నిర్వహించడం సమంజసం కాదన్నారు. అనారోగ్యంతో ఉన్న వారికి, చిన్నపిల్లల తల్లులకు, వద్ధ తల్లిదండ్రులు కలిగిన ఉపాధ్యాయులకు కష్టసాధ్యమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఈపూరు : మండలంలోని ఎ.ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు, ఊడిజర్ల విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలలో విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.గాంధీబాబు శుక్రవారం తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం తెల్లవారుజామున 4 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, మిగిలిన సమయాన్ని మూడు గంటల తర్వాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్లలోని 220/132/33 కెవి సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, 3ఫేస్ విద్యుత్ శనివారం తెల్లవారుజామున 12 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు.

తవ్విన రోడ్డును పూడ్చాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :మంగళగిరి మండలం చిన్న కాకాని సత్రాల రోడ్డులో గతంలో వర్షపు నీరు వెళ్లేందుకు రోడ్డుని తవ్వారని నేటికి పూడ్చలేదని ఫలితంగా ప్రమాదం పొంచి ఉందని సిపిఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు సంఘటన ప్రదేశంలో శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన సమస్యకు పరిష్కారం కాలేదని అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సిమెంట్ రోడ్డు క్రింద మట్టి మొత్తం పోయిందని రోడ్డుపై వెళ్లే వాహనాలు ఎప్పుడు పడిపోతాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రమాదం జరిగితే గాని అధికారులు స్పందించని విధంగా ఉండటం సిగ్గుచేటని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పటికైనా పంచాయతీ మున్సిపల్ అధికారులు త్వరితన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల నాయకులు బి. కోటేశ్వరి, టి. ప్రసాద రెడ్డి, ఆళ్ళ సాంబిరెడ్డి, ఎస్. సుమ, ఎస్. నిర్మల, గండికోట బాబు వరప్రసాద్, ఉద్దంటి దుర్గారావు, చెన్నం కుమార స్వామి, శివయ్య, ఈదా శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా ఆక్రమణలు తొలగిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్లపై ఆక్రమణలను దశల వారీగా తొలగిస్తామని, నగర స్వచ్ఛత కోసం ఆక్రమణదారులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల, రైలుపేట ప్రధాన రహదారిలో డ్రైన్లమీద, రోడ్లమీద ఆక్రమణలను ఏసిపి మల్లికార్జున ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక అక్రమ ఆక్రమణ దళం తొలగించారు. ఆక్రమణల వల్ల వ్యర్థాలు మురుగునీటికి అడ్డుపడి వర్షంనీరు రోడ్లమీదకు, ఇళ్లల్లోకివెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ అన్నారు. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైన్లపై ఆక్రమణలను గుర్తించి, వాటిని వారంతట వారే తొలగించుకోవాలని తెలియచేశామన్నారు. స్పందించని ఆక్రమణలను ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జిఎంసి పట్టణ ప్రణాళికాధికారులు తొలగిస్తారని స్పష్టం చేశారు. వార్డు సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారుల సమన్వయంతో గుర్తించి, వాటి తొలగింపునకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు.నగర ప్రజలు కూడా ప్రధాన డ్రైన్లను వివిధ వ్యాపారాల పేరుతో ఆక్రమణ చేసుకోకుండా జిఎంసికి సహకరించాలని కోరారు.

ఆక్రమణలు తొలగిస్తున్న జిఎంసి అధికారులు, సిబ్బంది

పెదనందిపాడు డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరీముల్లా

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండల నూతన డిప్యూటీ తహశీల్దార్ గా షేక్ కరీముల్లా బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. ఈయన గతంలో బాపట్ల జిల్లా పిట్టలవారిపాలెం డిప్యూటీ తహశీల్దార్ గా విధులు నిర్వహిం చారు. తహశీల్దార్‌నకు మండల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో మిట్టపల్లి ఇంజినీరింగ్ విద్యార్థుకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రాంగణ ఎంపికల్లో మిట్టపల్లి ఇంజినీరింగ్ బిటెక్ ఫైనలియర్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ గోపికృష్ణ తెలిపారు. శుక్రవారం తమ కళాశాలలో ట్యాప్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో సిఎస్ఇ, ఎఐ, ఐటి, ఇసిఇ విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరవగా 16 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి సుమారు రూ.3 లక్షల నుండి, రూ.5.5 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని చెప్పారు. ఎంపికైన వారిని కళాశాల సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ, ఏవో సిహెచ్ శ్రీనివాసరావు, టిపిఒ, విభాగాధిపతులు అభినందించారు.

'పల్లె పండుగ' అభివృద్ధికి తొలిమెట్టు

ప్రజాశక్తి - దుగ్గిరాల

గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం గ్రామీణ అభివృద్ధికి తొలిమెట్టు అని ఇంచార్జ్ ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెనుమూలి మంచికలపూడి కంఠంరాజు కొండూరు గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మంచికలపూడి కంఠంరాజు కొండూరు గ్రామంలో డొంక రోడ్లు పెనుమూలి గ్రామంలో 2 సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పెనుమూలి సర్పంచ్ కొరిటాల పద్మావతి, కొరిటాల సురేష్, కార్యదర్శి బాపయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. కంఠంరాజు కొండూరు గ్రామంలో సర్పంచ్ పున్నం ఝాన్సీ మంచికిలపూడి గ్రామంలో సర్పంచ్ సిద్దల శ్రీవాణి ఉజ్వల హరిణి ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు టిడిపి నాయకులు కేశంనేని శ్రీ అనిత ఎన్ రవి జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునగాకు వంటలపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్ సౌజన్యశ్రీ

అంగన్వాడీల్లో మునగాకు వంటలపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలిరూరల్: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్న సామాజిక వేడుకల్లో భాగంగా స్థానిక ఐతానగర్, 40వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మునగాకులో ఉండే పోషకాలు, స్త్రీలలో రక్తహీనత నివారణకు మునగాకు ఉపయోగాలపై ఐసిడిఎస్ ప్రాజెక్ట్ తెనాలి వన్ సెక్టార్ సూపర్వైజర్ కొడాలి సౌజన్యశ్రీ అవగాహన కల్పించారు. అన్నిరకాల వంటకాల్లో మునగాకు ను ఉపయోగించవచ్చుని, జిల్లా వ్యాప్తంగా నిర్వహి స్తున్న సామాజిక కార్యక్రమాల్లో భాగంగా మునగాకు వంట లపై అవ గాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, జెఎంజె కళాశాల హోమ్ సైన్స్ విద్యార్థినీలు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జీవన్ సాగర్

ఉచిత బస్సు నడిచేది ఎప్పుడు ? : కాంగ్రెస్

ప్రజాశక్తి - మంగళగిరి : ప్రజా సమస్యలపై పోరాడేది కాంగ్రెస్ పార్టీయే అని మంగళగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల సీఎం ఉచిత బస్సు ఏమైంది.. అంటూ విజయవాడ నుండి మంగళగిరి వచ్చే సిటీ బస్సు లో ప్రయాణించింది. పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిలకు స్వాగతం పలికేందుకు మంగళగిరి తెనాలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు. అయితే షర్మిల బస్సులోనే వెళ్ళిపోయింది. అనంతరం జీవన్ సాగర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. వీటిపై ప్రశ్నించేం దుకు పిసిసి అధ్యక్షురాలు బస్సులో ప్రయాణించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ సలీం, ఆర్ హనుమంతరావు, గోలి సాంబశివరావు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

ప్రజాశక్తి - తెనాలి : దోమల నిర్మూలనకు అధికారులతో పాటు ప్రజలు కూడా సహకరించాలని సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బాలాజీ రావు పేటలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి దోమల నియంత్రణ చర్యలపై కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా దోమ కాటు ఎంతో ప్రమాదకంమైందన్నారు. ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా ప్రజలు చూసుకోవాలన్నారు. జనావాసాల మధ్య ఉన్న నీటి నిల్వలను తొలగింప చేశారు. కార్యక్ర మంలో సచివాలయం అడ్మిన్ బి. శాంత కుమారి, ఆరోగ్య సిబ్బంది ఎ బాలచంద్రమౌళి, పట్టణ సబ్ యూనిట్ అధికారి ఎస్ ఉమాకాంత్, డి శ్రీనివాసరావు, షేక్ రషీద్, షేక్ నవీద్, పి. శ్యామల, రమిజాన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది

ఇబ్రహీంకు పలువురు పరామర్శ

ప్రజాశక్తి - మంగళగిరి : అనారోగ్యంతో బాధపడుతూ గత నెల గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పటల్లో శస్త్ర చికిత్స చేయించుకొని నంబూరులో తన నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇబ్రహీంను శుక్రవారం మంగళగిరి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, కర్నూలు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సయ్యద్ ఖలీద్, ఏలూరు పాషా సహిద్ దర్గా ముజావర్ అహ్మద్ అలీ, జాకీర్ అలీ, కొండపల్లి దర్గా మతవల్లి అన్సారీ పరామర్శించారు.

కొత్తూరులో తాగునీటి మోటారు రిపేరు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్నంలోని కొత్తూరు లో మంచినీటి సరఫరా చేసే మోటార్ రిపేర్ కొచ్చి మోరయించాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో ని ప్రజలకు సక్రమంగా మంచినీరు అందటం లేదు. దీనిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులను వివరణ కోరగా మోటార్లు కొద్దిగా రిపేర్ వచ్చింది వాస్తవమేనన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గతంలో మూడు గంటలు మంచినీటి సరఫరా చేసే సమయాన్ని ప్రస్తుతం నాలుగు గంటలు నీరు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. శనివారం నాటికి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 132 కెవి కండక్టర్ మార్పు సందర్భంగా బ్రహ్మానందపురం, వేమారెడ్డి కాలనీ, రాధా రంగా నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని డి జి సురేష్ బాబు, విద్యుత్ ఏఈ షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంజన్ల ద్వారా నీరు తొలగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి :వర్షం వల్ల ఉండవల్లి, తాడేపల్లి పెట్రోల్ బంకుల దగ్గర పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలబడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎంటీఎంసీ కమిషనర్ ఆలిం భాష దృష్టికెళ్ళింది. ఆయన వెంటనే స్పందించి రెండు ప్రాంతాల్లో ఆయిల్ ఇంజను ని పెట్టి కచ్చ కాలువలు తవ్వించి వర్షపు నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకున్నారు. కమిషనర్ చర్యల పట్ల స్థానికులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

డ్రైయినేజీ కాల్వలో తాగునీటి పైపు లైన్

ప్రజాశక్తి-తాడేపల్లి : రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లి అమరావతి నగర్‌లో డ్రైనేజీ కాలువలో మంచినీటి పై పు కలిసిపోయింది. ప్రస్తుతం ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్స్ పెద్ద ఎత్తున రావడం తో స్థానికులు ఆందోళన చెందు తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న సుమారు 200 కుటుంబాలకు ఈ పైప్ లైన్ ద్వారానే మంచినీరు సరఫరా అవుతుంది. డ్రైనేజీలో ఉన్న మంచినీటి పైపు లైను వెంటనే మరమ్మతులు చేయాలని రాజధాని సిపిఎం నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు ఒక ప్రకటన కోరారు.

22న విజయవాడలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి : 22వ తేదీన విజయవాడ లో వ్యవసాయ రంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎంబీవికే భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్ర సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరి రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం మంగళగిరి మండల కమిటీ సమావేశం ఏ సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శివశంకరరావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణ విమోచన చట్టం అమలు, వ్యవసాయ రంగంలో కేరళ వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు అనుకూల విధానాలను వివరించారు. ఈ సదస్సులో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, ఏఐకేఎస్ సహాయ కార్యదర్శి టి సాగర్, కేరళ రాష్ట్ర మంత్రి ఎం బి రాజేష్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి టి ప్రసాద్ రెడ్డి, రైతు సంఘం నాయకులు గైరు బోయిన నాగేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన రైతాంగ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో జరిగిన తాడేపల్లి పట్టణ రూరల్ రైతుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి రైతు సంఘం అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. శివ శంకర్ రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వినాశనకరమైన చట్టాలను తీసుకొస్తే రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు బలపరుస్తున్నాయని విమర్శించారు. దేశానికి పట్టడం అన్నంపెట్టి రైతు సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. వీటిపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ఈనెల 22వ తేదీ విజయవాడ ఎంబీ వికేలో జరిగే రైతు సదస్సు ను జయ ప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు దొంత రెడ్డి వెంకట్ రెడ్డి. భీమవరపు కోటిరెడ్డి. దొంతి రెడ్డి బుల్లి కోటిరెడ్డి. విజయ భాస్కర్ రెడ్డి. అమ్మిశెట్టి రంగారావు. కాజా వెంకటేశ్వరరావు. బూరుగ వెంకటేశ్వర్లు. సిహెచ్ లక్ష్మారెడ్డి. చింత శ్రీరామ్. పాల్గొన్నారు. విజయవాడ సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లి పట్నంలోని నెహ్రూ బొమ్మ సెంటర్లో రైతుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ఆర్కియాలజీలో కోటేశ్వరరావుకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కియాలజీ విభాగంలో పరిశోధన చేసినందుకు కె కోటేశ్వరరావుకు పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ ఆఫ్ ద మైనర్ డైనస్టిస్ ఆఫ్ కాకతీయాస్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని కోటేశ్వరరావు సమర్పించారు. కోటేశ్వరరావుకు పరిశోధన పర్యవేక్షకులుగా డాక్టర్ ఈ.వీ. పద్మజ వ్యవహరించారు.

స్కానింగ్ కేంద్రాలను తనిఖీలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆన్లైన్‌లో రిజిస్టర్ అయ్యే కొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యువల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రాం ఆఫీసర్లు సందర్శించి తనిఖీ చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధ్యక్షతన గర్భస్థ లింగనిర్ధారణ చట్టంపై డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీమెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని, స్కానింగ్ కోసం స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల నుండి గర్భస్థ లింగ నిర్ధారణపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. డియంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గతంలో ఫిర్యాదులు అందిన తెనాలి, పొన్నూరులో స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని, కానీ సదరు ఆపరేషన్‌లో ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ కాలేదని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మొత్తం 292 గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షా కేంద్రాలు వున్నాయని, వాటిలో 15 రెన్యువల్ రిజిస్ట్రేషన్ కోసం, తొమ్మిది మాడిఫికేషన్ కోసం, రెండు రద్దు కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే క్రొత్తగా ఐదు స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఎయిమ్స్ మంగళగిరిలో ఒక ఏఆర్‌టి, సరోగసికి దరఖాస్తు చేసుకున్నారని వాటిని కమిటీ సభ్యులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయడం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిటీ కొత్త స్కానింగ్ సెంటర్లు, రెన్యువల్, మార్పులు చేర్పులు, రద్దుకు దరఖాస్తులను ఆమోదం తెలిపింది. సమావేశంలో డిఐఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, కమిటీ సభ్యులు డాక్టర్ దేవకుమార్, డాక్టర్ అరుణ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డిఎస్పీ బి.వి.సుబ్బారావు, ఎన్‌జిఓ సీడ్స్ ప్రాజెక్టు డైరెక్టర్ డి. రోషన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ బార్గవ్ తేజ

వీధి బాలల రక్షణకు ప్రత్యేక కార్యాచరణపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

వీధి బాలల పరిరక్షణకు అక్టోబర్, డిసెంబర్‌లో ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ తెలిపారు. వీధి బాలల రక్షణ, పునరావాసం తదితర అంశాలపై జేసీ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల ప్రకారం అక్టోబర్, డిసెంబర్‌లో ఇట్టి వీధి పరిస్థితులలో ఉన్న బాలల రక్షణకు, వారికి అందిచాల్సిన వివిధ సంక్షేమ పథకాలు, ఇతర సౌకర్యాలను అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఏఏ ప్రభుత్వ విభాగాలు ఏవిధమైన సేవలు అందించాలి, ఎక్కడెక్కడ పునరావాస సౌకర్యాలు కల్పించాలి, రక్షించబడిన బాలలకు ఎటువంటి సదుపాయాలు అందించాలి అంశాలపై జేసీ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్, ఆర్డీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డిఇఒ, తదితరులు

క్రీడల వల్ల ఆత్మవిశ్వాసం అలవడుతుంది : డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ -14, అండర్ -17 చెస్ పోటీలు శుక్రవారం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలోని 17 నియోజకవర్గాల్లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు 340 మంది జిల్లా స్థాయిలో పోటీ పడుతున్నారని, ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. క్రీడల వల్ల ఆత్మవిశ్వాసం, ఐకమత్యం వెల్లివిరిసి, ఉన్నత విలువలతో విద్యార్థులు ఎదుగుతాడని అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల్లో మరింత ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్.మహమ్మద్ ఖాసిమ్ మాట్లాడుతూ ఆటల ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. కన్న విద్యా సంస్థల డైరెక్టర్ కన్న మాస్టార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. ముఖ్యంగా చెస్ ద్వారా ఏకాగ్రత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థి అభివృద్ధికి ఏకాగ్రత ఎంతో దోహదం చేస్తుందన్నారు. పాఠశాల విద్య ఆర్‌ఐపి షేక్.మహబూబ్‌భాషా మాట్లాడుతూ ఆటలు సమైక్యతను చాటి చెప్పటమే కాకుండా ఉపాధిని కలిగిస్తాయన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ క్రీడలు, చదువు నాణేనికి బొమ్మా బొరుసు లాంటివని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒలో నాగేంద్రమ్మ, రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు సామ్రాజ్యం, రవిశేఖర్, చెస్ అర్బిటర్ యమ్.గోపినాద్ పాల్గొన్నారు.

శుభం కోల్డ్‌స్టోరేజీ బాధిత రైతులకు సత్వరమే పరిహారం

ఇన్స్యూరెన్స్ కంపెనీ, అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో దుగ్గిరాలలో శుభం కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదంలో పసుపు దగ్ధం అయ్యి నష్టపోయిన రైతులకు వీలైనంత త్వరగా ఇన్సురెన్స్ కంపెనీ నుంచి పరిహారం అందించేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్ .నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి కలెక్టర్ నాగలక్ష్మి తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి శుభం కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాద బాధిత రైతులకు పరిహారం అందజేతపై న్యూ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ, రెవెన్యూ, అగ్నిమాపక, వ్యవసాయ మార్కెటింగ్, బ్యాంకు అధికారులు, శుభం కోల్డ్ స్టోరేజీ యాజమాన్యంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో న్యూ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తినష్టంపై సర్వే పూర్తి చేయటం జరిగిందని, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ తదితర శాఖలతోపాటు, కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం నుంచి అవసరమైన డాక్యుమెంట్లును తీసుకొని సోమవారం నాటికి కంపెనీ ప్రధాన కార్యాలయానికి ఫైలు అందజేస్తామని తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుభం కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం వల్ల రైతుల పసుపు దగ్ధం అయ్యి తీవ్రంగా నష్టంపోయారని, వారికి ఇన్స్యూరెన్స్ కంపెనీ కంపెనీ పరిహారం త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం నుంచి ఇతర ప్రభుత్వ శాఖల నుంచి క్లైయిమ్‌కు అవసరమైన డాక్యుమెంట్ల్ ఇన్సురెన్స్ కంపెనీలు తీసుకొని సోమవారం నాటికి ఖచ్చితంగా ఇన్సురెన్స్ ప్రధాన కార్యాలయానికి అందించాలన్నారు. క్లైయిమ్‌లకు సంబంధించి అన్ని అంశాలపై తెనాలి సబ్‌కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు తెలియజేస్తే అవసంమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

21న సమకాలీన పరిణామాలపై సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు తదితరులు

లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 21న సాయంత్రం 4 గంటలకు స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో సమకాలీన రాజకీయ పరిణామాలపై జరిగే సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావులు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో సభ ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రజలపై అనేక భారాలు మోపుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు నానాటికి పెరుగుతున్నాయని, పేదలకు ఉపాధిలేక అర్ధాకలితో అలమటిస్తున్నారని, మరోవైపు దేశంలో ఆర్థిక మాద్యం పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. క్రిమినల్ చట్టాలలో మార్పులు తెచ్చి ప్రతి పక్షాలను, ఉద్యమకారులను నిర్భంధం ప్రయోగిస్తున్నారన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానానికి అనుగుణంగా ఉచిత ఇసుకను అమలు జరపలేదని భవన నిర్మాణ కార్మికులు ఉపాధిలేక విలవిల్లాడుతున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉచిత ఇసుకను ప్రవేశ పెట్టాలని కోరారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.8,114 కోట్లు ప్రజలపై అధనపు భారాలు మోపే ప్రయత్నం జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జరిగే సభలో వందలాది మంది ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు ఎమ్.ఎ.చిష్టీ, ఎమ్.కిరణ్, వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం సకాలంలో అందించాలి

జిజిహెచ్‌లో పేషంట్ల నుండి తీసుకున్న నగదు తిరిగి ఇచ్చేయాలి : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ పరిధిలోని నెట్‌వర్క్ ఆసుపత్రులలో పేషెంట్లకు నగదు రహిత వైద్యం సకాలంలో, ఎటువంటి అంతరాయం లేకుండా అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆసుపత్రుల యాజమాన్యాలకు స్పష్టం చేశారు. అత్యవసర సేవలలో వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. శుక్రవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవా డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 209 ఫిర్యాదులపై కమిటీ విచారణ జరిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టి ఆర్ వైద్యసేవా, ఈహెచ్‌ఎస్ పేషెంట్లకు నగదు రహిత వైద్యం అందేలా అన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈహెచ్‌ఎస్ పథకం క్రింద ఉద్యోగులు, పెన్షనర్లు నెట్‌వర్క్ ఆసుపత్రులకు వచ్చినప్పుడు వైద్యసేవలు తిరస్కరించకుండా వారికి తగిన వైద్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సమగ్ర వైద్యశాల గుంటూరుపై వచ్చిన ఫిర్యాదులమీద సమగ్ర విచారణ జరిపి త్వరితగతిన రోగులు చికిత్స సమయంలో ఖర్చు పెట్టిన డబ్బులను తిరిగి రోగులకు వారం రోజులలోపు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సమగ్ర వైద్యశాల గుంటూరు నందు పనిచేయుచున్న ఎన్‌టీఆర్ వైద్యసేవా సిబ్బందికి, ఆసుపత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించి రోగులకు నగదు రహిత వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జీజీహెచ్‌లో చికిత్స తీసుకొని డిశ్చార్జ్ అయ్యే ప్రతిరోగి నుండి వైద్యానికి సంబంధించిన డిశ్చార్జ్ ఫార్మాట్ తీసుకొని అన్ని వైద్య సేవలు నగదు రహితంగా జరిగాయా లేదా అని తెలుసుకొని, రోగులు మందులు, పరీక్షల నిమిత్తం డబ్బు ఖర్చు చేసి ఉంటే తిరిగి డిశ్చార్జ్ సమయంలో రోగులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డియం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ, జాయింట్ డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ సుధారాణి , డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.మజీద బి , రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ పి.రామచంద్రరాజు , ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.విజయప్రకాశ్, జిల్లా మేనేజర్ సిహెచ్. రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.